కాకతీయ యూనివర్సిటీ
వైస్ చాన్స్‌లర్‌గా ప్రతాప్‌రెడ్డి

యాచారం, అక్టోబర్18: రైతు కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకొని కాకతీయ విశ్వ విద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌గా నియమితులయ్యాడు కర్నాటి ప్రతాప్ రెడ్డి. యాచారం మండలం గాండ్లగూడ గ్రామానికి చెందిన కర్నాటి మోహన్‌రెడ్డి-విమలమ్మల దంపతుల కుమారుడు ప్రతాప్‌రెడ్డి చిన్నప్పటి నుంచే కష్టపడి చదివే తత్వం అతడిది. యాచారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించి అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసించాడు. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అతడు ఉస్మానియా యూనివర్సిటిలో బాటనీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించాడు. అదే యూనివర్సిటీలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్, ఆడిట్ సెల్ డైరెక్టర్, రిజిస్ట్రర్, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, సైన్స్ డీన్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టాడు. ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్నత బాధ్యతలను చేపట్టనున్నాడు. అతడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మారుమూల గ్రామం నుంచి కాకతీయ యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా ప్రతాప్‌రెడ్డి నియమితులైనందుకు యాచారం, గాండ్లగూడ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బహుమతుల ప్రదానం

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 18 : చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో ఈ ఈ నెల 16 నుంచి బ్లూ ఆర్మీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఫైనల్ పోటీల్లో బ్లూ ఆర్మీ టీం మొదటి స్థానం.. వెంకటాపూర్ తండా టీం రెండో స్థానంలో.. మూడో స్థానంలో శివారెడ్డిపేట్ టీం నిలిచింది. గెలుపొందిన విజేతలకు సీఐ భూపాల్ శ్రీధర్, టోర్నమెంట్ నిర్వాహకుడు వెంకటేశ్ షీల్డ్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు బాబర్, గ్రామస్తులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

షాబాద్, అక్టోబర్ 18: తాళ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమార్కుల పేర్లు తొలగించి, అసలైన రైతులకు న్యాయం చేయాలని బీజేపీ షాబాద్ మండల అధ్యక్షుడు లంబడి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సినీయర్ అసిస్టెంట్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని తాళ్లపల్లి రెవెన్యూలో సర్వే నెంబర్ 483లో వాస్తవ రికార్డు ప్రకారం ఉండాల్సిన ప్రభుత్వ భూమి 153ఎకరాల 4గుంటలకు గాను ప్రస్తుత రికార్డు 233 ఎకరాల 29గుంటలకు పెరిగిందన్నారు. ఈ సర్వేనెంబర్‌లో నిజమైన రైతులను గుర్తించి, అక్రమంగా రికార్డులో ఎక్కించుకున్న పేర్లను తొలగించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసలైన రైతులకు న్యాయం చేయాలని కోరారు. వీరి వెంట నాయకులు రాజేశ్, రాజీవ్‌రెడ్డి, రాజు, రాకేశ్ ఉన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

చేవెళ్లటౌన్, అక్టోబర్ 18: నేడు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నేడు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉదయం 10గంటలకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ హాజరవుతున్నారని తెలిపారు. సభా అధ్యక్షుడు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

21న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు , అక్టోబర్ 18 : ఈ నెల 21న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారందరూ ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకుని ఈ శిబిరానికి హాజరుకావాలని వారు సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

చేవెళ్లరూరల్, అక్టోబర్ 18 : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ శంకర్‌పల్లి శాఖ కన్వీనర్ నితిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పెండింగ్ నిధులను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దాదాపు రూ.7,500 కోట్లకుపైగా పెండింగ్ బకాయిలు ఉన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా బకాయిలను విడుదల చేయడంలో తాత్సారం చేస్తున్నదని, దీంతో పేద విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. బకాయిలు విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో ఏబీవీపీ నగర ఉపాధ్యక్షుడు శివ చారి, నాయకులు హరీశ్వర్, వంశీ, కార్తీక్, శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 18 : మండలాలు, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ఉపాధి హామీ పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలకల్పనలో రాజీలేకుండా ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు వెంకయ్య గౌడ్, హిమబిందు, సంధ్య, అపర్ణ, శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ దసరా సమ్మేళనం

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 18 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న దసరా సమ్మేళనం నిర్వహిస్తున్నారు. బొంగుళూరు గేటు సమీపంలోని ప్రమీదాగార్డెన్‌లో నిర్వహించే దసరా సమ్మేళనానికి ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై వారితో చర్చించారు. ముఖ్యంగా మాజీ శాసనసభ్యులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న తరుణంలో ఇబ్రహీంపట్నంలో జరిగే దసరా సమ్మేళనాన్ని పకడ్బందీగా నిర్వహించే ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును ఆహ్వానించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసే దిశగా కృషిచేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొనే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

విజయవంతం చేయాలి

దసరా సమ్మేళనం కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

త్వరలో నెట్ బ్యాంకింగ్ సేవలు

రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ రవీందర్‌రావును సన్మానిస్తున్న డీసీసీబీ డైరెక్టర్, ఉమ్మడి ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు, అక్టోబర్ 18: జిల్లా సహకార బ్యాంకుల (డీసీసీబీ) ద్వారా ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ సంసిద్ధంగా ఉందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆర్‌బీఐ నిబంధనలు అనుసరించి డీసీసీబీ బ్యాంకుల్లో త్వరలో నెట్ బ్యాంకింగ్ సేవలైన యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పే, వంటి నెట్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు వారు పేర్కొన్నారు. నెట్ బ్యాంకింగ్ సేవలకు సంబంధించి అప్రూవల్స్ ఆర్‌బీఐ నుంచి శుక్రవారం ఉదయం లభించినట్లు వారు పేర్కొన్నారు.

కడ్తాల్‌లో డీసీసీబీ బ్యాంకు ఏర్పాటు చేయాలని వినతి

ఆర్‌బీఐ నిబంధనలకు లోబడి రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా 20 డీసీసీబీ బ్యాంకు శాఖలు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని కడ్తాల్ మండలంలో నూతనంగా డీసీసీబీ బ్యాంకు ఏర్పాటు చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ రవీందర్‌రావును తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ మీటింగ్‌లో కోరామని, దీనికి వారు సానుకూలంగా స్పందించి త్వరలో కడ్తాల్‌లో డీసీసీబీ బ్యాంకు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తామని తెలిపినట్లు డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్లు రమేశ్‌రెడ్డి, సత్తయ్య, బొజ్జరెడ్డి, దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలి

తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

కడ్తాల్, అక్టోబర్ 18: మండల కేంద్రం సమీపంలో నుంచి వెళ్తున్న పవర్‌గ్రిడ్ హై టెన్షన్ విద్యుత్ లైన్ పోల్ సర్వే అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కడ్తాల్ గ్రామానికి చెందిన పలువురు రైతులు, నాయకులు... శుక్రవారం తహసీల్దార్ ముంతాజ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీదర్ నుంచి పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ కంపెనీ అథారిటీ వారు బళ్లారి నుంచి మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌ఖాన్‌పేట్ వరకు 765 కేవీ హై టెన్షన్ పోల్స్ వేయడానికి సర్వే చేయడం జరిగిందని తెలిపారు. కడ్తాల్ రెవెన్యూ పరిధిలోని 66 సర్వే నెంబర్లలో గల భూముల్లో దాదాపు 150 మంది రైతుల పొలాల గుండా పోల్స్ ఏర్పాటుకు అలైన్‌మెంట్ రూపొందించారన్నారు. పోల్స్ ఏర్పాటుతో చిన్న, సన్న కారు రైతులే నష్టపోతున్నారని తెలిపారు. పోల్స్ కోసం సర్వే చేసిన భూముల్లో అధికంగా డెయిరీ ఫామ్‌లు ఉన్నాయని తెలిపారు. కడ్తాల్ పట్టణం నుండి 300 మీటర్ల దూరంలో పోల్స్ ఏర్పాటుకు సర్వే చేయడంతో కడ్తాల్ గ్రామంలో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఇది వరకే మండల కేంద్రం శివారు గుండా రెండు భారీ హై టెన్షన్ పోల్ లైన్లు వెళ్లాయని, మూడోది ఏర్పాటు చేస్తే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారు అవుతుందన్నారు. పోల్స్ ఏర్పాటు చేసిన భూములను కొనడానికి ఎవరు ముందుకురారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు హై టెన్షన్ పోల్ లైన్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చి, గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంగా తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, జంగారెడ్డి, రైతులు రాములుయాదవ్, పెంటారెడ్డి, యాదయ్యగౌడ్, రాజేశ్, రాజేందర్‌గౌడ్, నరేశ్‌నాయక్, మల్లేశ్‌యాదవ్, గణేశ్‌ముదిరాజ్, వెంకటేశ్, శ్రీరాములు, కేశవులు, శ్రీనివాస్, మల్లేశ్‌గౌడ్, గాంధీ, బ్రహ్మచారి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: మక్తగూడలో పశువుకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, అక్టోబర్ 18: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవాకం షాబాద్ మండల పరిధిలోని మక్తగూడ, మద్దూర్ హన్మయ్యతండా, షాబాద్, సర్దార్‌నగర్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్, కృష్ణమూర్తి, సుధాకర్, శ్రీకాంత్, బలరాం, రాణి, రైతులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఆమనగల్లు : మండల పరిధిలోని సింగంపల్లిలో శుక్రవారం 168 ఆవులకు, 24 గేదెలకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారి అగ్నివేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ పాడి రైతులు పశువులకు టీకాలు వేయించి వ్యాధిబారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానోద్దీన్, పాలక్ష, హరీశ్, రమేశ్, ప్రకాశ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు, అక్టోబర్ 18 : ఆమనగల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ బోధించుటకు కనీసం పీజీలో 55 శాతం మార్కులతో పీజీ అర్హత కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కల్గిన అభ్యర్థులు 19వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు ఆమనగల్లు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతపరుస్తాం

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కడ్తాల్, అక్టోబర్ 18: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను రాబోయే రోజుల్లో మరింత విస్తృతపరుస్తామని క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన జంబుల రంగనాయకమ్మ వర్ధంతి సందర్భంగా, పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమాన్ని క్లబ్ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ మహేందర్‌కుమార్‌రెడ్డి, పీఆర్వో పాషా, కార్యదర్శి మహేశ్, జిల్లా కోఆర్డినేటర్ రాంరెడ్డి, జిల్లా చైర్మన్ రమేశ్, సభ్యులు వేణుగోపాల్, రాజేందర్‌యాదవ్, అంజయ్య, శ్రీను, వెంకటేశ్, గోవర్ధన్‌రెడ్డి, కుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌ను పునరుద్ధరించాలి

ఆందోళన చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

కడ్తాల్, అక్టోబర్ 18: తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామానికి నడిచే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్జల్‌గజ్ నుంచి జూలపల్లి మీదుగా ఊర్కొండపేట వరకు నడిచే బస్ సర్వీసును రద్దు చేయడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యార్థులు సమయానికి పాఠశాలకు వెళ్లలేక పోతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్సును పునరుద్దరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌గౌడ్, అనిల్‌కుమార్, వెంకటేశ్, రాఘవేందర్, విజేందర్, యాదయ్య, శ్రీను, నర్సింహ, చంటి, నరేశ్, బాలయ్య, శేఖర్, కార్తీక్, శివగౌడ్ పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను తగ్గించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి పూనమ్

మొయినాబాద్, అక్టోబర్18: మాతా శిశు మరణాలను తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి పూనమ్ అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు క్షేత్ర స్థాయిలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం పట్ల సరైన అవగాహన కల్పించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. గర్భిణులను ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చి వారికి వైద్య సేవలు అందే విధంగా క్షేత్రస్థాయిలో పని చేయాలని అన్నారు. ప్రభుత్వ దవఖానలో ప్రసవాలు జరిగే విధంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రసవం జరిగిన తరువాత తల్లీబిడ్డ సురక్షితంగా ఇంటికి వెళ్లే విధంగా చర్యలు చేపడితే మాతాశిశు మరణాలను అరికట్టవచ్చని చెప్పారు. బాలింత, బిడ్డ ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యత కూడా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలదేనని గుర్తు చేశారు. సమావేశంలో మండల వైద్యాధికారి అన్నపూర్ణ, సీహెచ్‌వో వెంకట్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 18 : శంకర్‌పల్లి పరిధి మోకిలా తండా అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు గ్రామ యువజన నాయకుడు కేతావత్ లింబియా నాయక్ శుక్రవారం స్పోర్ట్స్ డ్రెస్, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు శివకుమార్, భక్తప్ప, అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ, గ్రామ యువజ నాయకులు శ్రీను నాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల పాదయాత్ర

మొయినాబాద్, అక్టోబర్18:అయ్యప్ప మాలధారణ వేసి దీక్ష చేస్తున్న ప్రతి అయ్యప్ప భక్తుల్లో మంచి పరివర్తన వస్తుందని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. అయ్యప్ప మాలధారణ చేసిన విజయబార్గవ రెడ్డి, కుమ్మరి శివశంకర్ ఆధ్వర్యంలో చిలుకూరు గ్రామానికి చెందిన 21 మంది అయ్యప్ప భక్తులు శబరిమలైకి పాదయాత్రగా వెళ్లడానికి శుక్రవారం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి ప్రారంభించారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ఆలయంలో అయ్యప్ప భక్తుల కోసం పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప భక్తుల పాదయాత్రను ఆయన ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం, అక్టోబర్18: మోటర్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిల్లిపల్లి గ్రామ సమీపంలో జరిగింది. సీఐ కృష్ణంరాజు కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన తుపాకుల మల్లేశ్(40) నందివనపర్తి గ్రామానికి అనుబంధంగా ఉన్న పిల్లిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు వెంచర్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. తన బైకుపై తాటిపర్తి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులపై దాడి హేయమైన చర్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్, అక్టోబర్18: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ఆరు గ్యారంటీలతో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేశాడని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో బీజేపీ అభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేవైఎం చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన కార్యక్రమానికి చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్‌తో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మరిచిందన్నారు. రైతు రుణ మాఫీని అటకెక్కించారని ఆరోపించారు. నిరుద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ సర్కార్ ఉద్యోగాల కోసం నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులతో దాడి చేయించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, బీజేవైఎం ర